నెమ్మదించిన జీడీపీ వృద్ధి

7.8 శాతం నుంచి 7.6 శాతానికి తగ్గుదల

ద్రవ్యలోటు రూ.8 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 30: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో భారత్ జీడీపీ వృద్ధి రేటు మందగించింది. తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) నాలుగేండ్ల గరిష్ఠస్థాయి 7.8 శాతానికి చేరిన జీడీపీ వృద్ధి రేటు సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల కాలంలో 7.6 శాతానికి తగ్గినట్టు గురువారం జాతీయ గణాంకాల శాఖ (ఎన్ఎస్‌వో) విడుదల చేసిన డాటా వెల్లడిస్తున్నది. అయితే అత్యధిక శాతం విశ్లేషకుల అంచనాల్ని అధిగమించడం గమనార్హం. 2023-24 జూలై-సెప్టెంబర్‌లో జీడీపీ 6.7 శాతం పెరగవచ్చని ఆర్థిక వేత్తలు అంచనా వేశారు. అలాగే వృద్ధి 6.5 శాతం ఉంటుందని రిజర్వ్‌బ్యాంక్ ఇటీవలి అంచనాల్లో పేర్కొంది. 2011-12 స్థిర ధరల ప్రకారం ఈ క్యూ2లో జీడీపీ 41.74 లక్షల కోట్లకు చేరినట్టు ఎన్ఎస్‌వో తెలిపింది. 2022-23 జూలై-సెప్టెంబర్‌లో (6.2 శాతం వృద్ధి) ఇది రూ.38.78 లక్షల కోట్లు. దీనితో పోలిస్తే తాజా త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధి చెందింది. ప్రస్తుత ధరల ప్రకారం జీడీపీ రూ. 65.67 లక్షల కోట్ల నుంచి రూ.71.66 లక్షల కోట్లకు పెరిగింది. ఈ వృద్ధి 9.1 శాతంకాగా, 2022-23 క్యూ2లో వృద్ధిరేటు 17.2 శాతంతో పోలిస్తే ప్రస్తుత ధరల ప్రకారం తాజా త్రైమాసికంలో మందగించింది.

తయారీ రంగం వృద్ధి 13.9 శాతం

తాజాగా ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో తయారీ రంగం 13.9 శాతం వృద్ధిచెందింది. ప్రస్తుత పూర్తి ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్లో నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యంలో అక్టోబర్‌కల్లా 45 శాతానికి చేరుకుంది. గురువారం కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం అక్టోబర్ చివరినాటికి రూ. 8.03 లక్షల కోట్లు ద్రవ్యలోటు నమోదయ్యింది. 2023-24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటును రూ. 17.86 లక్షల కోట్లకు అదుపు చేయాలని బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వ వ్యయం, రెవిన్యూ మధ్య వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. నిరుడు ఇదేకాలంలో ఈ లోటు బడ్జెట్ అంచనాల్లో 45.6 శాతానికి చేరింది. 2023-24 బడ్జెట్ అంచనా వసూళ్లలో ప్రభుత్వం అక్టోబర్ చివరినాటికి రూ.15.9 లక్షల కోట్లు (58.6 శాతం) సమీకరించింది. అందులో రూ.13.01 లక్షల కోట్లు పన్ను వసూళ్లుకాగా, రూ.2.65 లక్షల కోట్లు పన్నుయేతర ఆదాయం, ఇతర ఆదాయం రూ.22,990 కోట్లు ఉన్నాయి. ఈ ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్యకాలంలో ప్రభుత్వ వ్యయం రూ.23.94 లక్షల కోట్లకు (బడ్జెట్ అంచనాల్లో 53 శాతం) చేరుకున్నట్టు సీజీఏ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మైనింగ్ రంగం 10 శాతం పెరగ్గా, వ్యవసాయ రంగం వృద్ధి 1.2 శాతానికే పరిమితమయ్యింది. ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్ రంగాల వృద్ధి నిరుడు ఇదే త్రైమాసికంతో పోలిస్తే 7.1 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. విద్యుత్, గ్యాస్, ఇతర యుటిలిటీ సర్వీసుల వృద్ధి రేటు 6.1 శాతం నుంచి 10.1 శాతానికి పెరిగింది. నిర్మాణ రంగం వృద్ధి రేటు 5.7 శాతం నుంచి 13.3 శాతానికి చేరింది.

కీలక రంగాల్లో ప్రగతి

న్యూఢిల్లీ, నవంబర్ 30: గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన కీలక రంగాలు మళ్లీ పుంజుకున్నాయి. బొగ్గు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు అంచనాలకుమించి రాణించడంతో అక్టోబర్ నెలకుగాను కీలక రంగాల్లో వృద్ధి 12.1 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇది 0.7 శాతంగా ఉన్నది. దేశీయ పారిశ్రామిక రంగంలో 40 శాతం వాటా కలిగిన కీలక రంగాల్లో బొగ్గు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు రెండంకెల వృద్ధిని సాధించాయి. మరోవైపు, ఏప్రిల్-అక్టోబర్ మధ్యకాలంలో కీలక రంగాల్లో 8.6 శాతం వృద్ధిని సాధించాయి.

మూడు బ్యాంక్‌లపై ఆర్బీఐ జరిమానా

ముంబై, నవంబర్ 30: మూడు బ్యాంకులపై రిజర్వు బ్యాంక్ కన్నెర చేసింది. బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఎన్.ఏ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లపై రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాలను పట్టించుకోకపోవడంతో బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఎన్.ఏపై, అలాగే నాన్-రెసిడెంట్స్ డిపాజిట్ల విషయంలో మార్గదర్శకాలు తిలోదకాలు ఇవ్వడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై ఫైన్ విధించింది. వీటితోపాటు పలు కో-ఆపరేటివ్ బ్యాంక్‌లపై జరిమానా లను వేసింది.

టాటా టెక్నాలజీస్ బంపర్ లిస్టింగ్

163 శాతం భారీ ప్రీమియంతో ముగిసిన షేరు

న్యూఢిల్లీ, నవంబర్ 30: అటు సంస్థాగత ఇన్వెస్టర్లు, ఇటు హైనెట్‌వర్త్ ఇన్వెస్టర్లు, రిటైలర్లు ఐపీవోలో షేర్లు దక్కించుకునేందుకు పోటీపడిన టాటా టెక్నాలజీస్ లిస్టింగ్ తొలి రోజునే రాకెట్‌లా దూసుకెళ్లింది. రూ.500 ధరకు ఐపీవోలో టాటా టెక్నాలజీస్ షేర్లను విక్రయించగా, గురువారం అది 140 శాతం ప్రీమియంతో రూ. 1,200 వద్ద లిస్ట్యయ్యి, ఇంట్రాడేలో రూ.1,400 గరిష్ఠస్థాయికి ఎగబాకింది. చివరకు 163 శాతం ప్రీమియంతో రూ. 1,314 వద్ద ముగిసింది. ఈ ధర వద్ద టాటా టెక్నాలజీస్ మార్కెట్ విలువ రూ. 53,315 కోట్లుగా నమోదయ్యింది. ఈ టాటా గ్రూప్ కంపెనీ ఐపీవోలో దాదాపు 4.50 కోట్ల షేర్లు ఆఫర్ చేయగా, వాటికి 70 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయిన సంగతి తెలిసిందే. టాటా టెక్నాలజీస్ ఆటోమొబైల్, ఎయిర్‌లైన్ కంపెనీలకు డిజిటల్ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సర్వీసుల్ని అందిస్తుంది. టాటా గ్రూప్ నుంచి 19 ఏండ్ల తర్వాత జారీ అవుతున్న ఇష్యూకావడం తదితర అంశాలతో టాటా టెక్నాలజీస్ ఐపీవో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. 2004లో టాటా గ్రూప్ నుంచి వచ్చిన ఐటీ దిగ్గజం టీసీఎస్ ఐపీవోలో మదుపుచేసినవారికి ఇప్పటికే ఎన్నో రెట్ల లాభాన్ని అందించింది.

అల్ట్రాటెక్ చేతికి కేశోరాం

షేర్ల కేటాయింపు ద్వారా డీల్ • 52 కేశోరాం షేర్లకు 1 అల్ట్రాటెక్ షేరు

న్యూఢిల్లీ, నవంబర్ 30: ఆదిత్యా బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ బీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన కేశోరాం ఇండస్ట్రీస్ సిమెంట్ వ్యాపారాన్ని చేజిక్కించుకోనుంది. టైర్లు, రేయాన్, కెమికల్స్ తదితర వ్యాపారాల్ని నిర్వహిస్తున్న కేశోరాం ఇండస్ట్రీస్ తన సిమెంట్ విభాగాన్ని వేరుపర్చి అల్ట్రాటెక్‌కు విక్రయిస్తున్నది. ఈ సిమెంట్ వ్యాపారానికి ఉన్న రుణంతో సహా రూ. 7,600 కోట్ల విలువను నిర్దేశిస్తూ ఆల్-షేర్ డీల్‌గా ఈ టేకోవర్ జరుగుతుంది. కేశోరాం షేర్‌హోల్డర్లకు ప్రతీ 52 షేర్లకు ఒక అల్ట్రాటెక్ షేరును కేటాయిస్తారు. ఈ డీల్ బిర్లా కుటుంబంలోనే జరగడం గమనార్హం. బీకే బిర్లాకు ఆదిత్యా బిర్లా గ్రూప్ అధినేత కుమార మంగళం బిర్లా మనుమడు. అలాగే కేశోరాం ఇండస్ట్రీస్‌లో కుమార మంగళం బిర్లాకు పరోక్ష పెట్టుబడులు సైతం ఉన్నాయి. ప్రస్తుతం కేశోరాం ఇండస్ట్రీస్‌కు బీకే బిర్లా కుమార్తె మంజుశ్రీ ఖైతాన్ నేతృత్వం వహిస్తున్నారు.

తెలంగాణ, కర్ణాటకల్లో ప్లాంట్లు

కేశోరాం సిమెంట్‌కు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని బసంత్‌నగర్, కర్ణాటకలోని సేదాంల్లో రెండు సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి స్థాపక వార్షిక ఉత్పాదక సామర్థ్యం 10.75 మిలియన్ టన్నులు. వీటితో పాటు మహారాష్ట్రలో 0.66 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం కలిగిన ప్యాకింగ్ ప్లాంటు కూడా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేశోరాం సిమెంట్ వ్యాపారం రూ. 3,534 కోట్ల టర్నోవర్ సాధించింది. కేశోరాంకు 18-20 శాతం అధిక వడ్డీతో కూడిన రూ. 1,700 కోట్ల రుణాన్ని తగ్గించుకోవడానికి యాజమాన్యం తాజా మూలధనాన్ని సమకూర్చుకోవడంలో విఫలమవుతున్నది. తాజా విక్రయంతో రూ. 1,700 కోట్ల రుణ మొత్తాన్ని సిమెంట్ వ్యాపారంతో పాటు అల్ట్రాటెక్‌కు బదిలీ అవుతుందని కేశోరాం అధికారి ఒకరు తెలిపారు. ఇక ప్రపంచంలో మూడవ పెద్ద సిమెంట్ కంపెనీ అయిన అల్ట్రాటెక్‌కు 137.85 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యం ఉంది. ప్రస్తుతం అమలు చేస్తున్న విస్తరణ ప్రాజెక్టులతో ఈ సామర్థ్యం 160 మిలియన్ టన్నులకు చేరుతుంది. కేశోరాం ప్లాంటును టేకోవర్ చేయడంతో వేగంగా వృద్ధిచెందుతున్న దక్షిణాది, పశ్చిమ మార్కెట్లలో విస్తరించే అవకాశం లభిస్తుందని అల్ట్రాటెక్ ప్రకటన తెలిపింది. వివిధ రెగ్యులేటరీ అనుమతులకు లోబడి ఈ డీల్ 9-12 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేస్తున్నామని కంపెనీ వెల్లడించింది.

ఫోర్బ్స్ దాతృత్వ హీరోల్లో

నిలేకనీ, కామత్, సింగ్

న్యూఢిల్లీ, నవంబర్ 30: ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నిలేకనీ, డీఎల్ఎఫ్ చైర్మన్ ఎమిరేట్స్ కేపీ సింగ్, జెరోధా సహవ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ తదితరులు దాతృత్వంలో తమ పెద్ద మనసును చాటుకున్నారు. గురువారం విడుదలైన ఫోర్బ్స్ ఆసియా ఫిలంత్రఫీ హీరోల 17వ జాబితాలో నిలేకనీ ఐఐటీ బాంబేకు రూ.320 కోట్లకుపైగా ఇచ్చినట్టు స్పష్టమైంది. ఇక్కడే నిలేకనీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివారు. కాగా, సంపదతోపాటు, వ్యక్తిగత సమయాన్ని తాము ఎంచుకున్న కారణాల కోసం వెచ్చించినవారితో ఈ లిస్టును ఫోర్బ్స్ సిద్ధం చేసింది. అయితే ఈ వార్షిక జాబితాలో కార్పొరేట్ ఫిలంత్రఫీని చేర్చలేదు. ఇక 2020లో డీఎల్ఎఫ్ చైర్మన్‌గా దిగిపోయిన కేపీ సింగ్.. తన పేరుపై ఫౌండేషన్ ట్రస్టు, చారిటబుల్ ట్రస్టులను స్థాపించి సహాయం చేశారు. ఈయన మొత్తం సంపద 14 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. నిఖిల్ కామత్ తన యూట్యూబ్ పాడ్‌కాస్ట్ సిరీస్ ద్వారా విరాళాలిచ్చారు. ఈయన సంపద 1.1 బిలియన్ డాలర్లుగా ఉన్నది.

డీ-మార్ట్ దమానీ టాప్

హురున్ సెల్ఫ్ మేడ్ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ మిల్లేనియా జాబితా

రూ.2.38 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానం

న్యూఢిల్లీ, నవంబర్ 30: దేశీయ రిటైల్ వ్యాపార సంస్థ డీ-మార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ.. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్ హురున్ ఇండియా గురువారం విడుదల చేసిన టాప్-200 సెల్ఫ్ మేడ్ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ది మిల్లేనియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. సంస్థ మార్కెట్ విలువ రూ.2.38 లక్షల కోట్లుగా ఉన్నది. రెండో స్థానంలో ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకులు బిన్నీ బన్సల్, సచిన్ బన్సల్ రూ.1.19 లక్షల కోట్లతో ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో జొమాటో దీపిందర్ గోయల్ (రూ.86,835 కోట్లు), డ్రీమ్ 11 ప్రమోటర్లు భవిత్ సేత్, హరీశ్ జైన్ (రూ.66.452 కోట్లు) ఉన్నారు. ఇదిలావుంటే జాబితాలోని అన్ని సంస్థల విలువ కలిసి రూ.30 లక్షల కోట్లుగా ఉన్నది. ఇది డెన్మార్క్ జీడీపీతో సమానం కావడం విశేషం. గ్రాసరీ డెలివరీ యాప్ జెప్టో వ్యవస్థాపకురాలు 21 ఏండ్ల కైవల్య.. ఈ జాబితాలో అతిపిన్న వయస్కురాలు. ఆ తర్వాత భారత్‌పే నుంచి శాశ్వత్ నక్రాని (25), జూపీ నుంచి దిల్షర్ మల్హీ (27) ఉన్నారు. నైకాకు చెందిన ఫాల్గుని నాయర్.. జాబితాలోని మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌లో టాప్‌లో ఉన్నారు. దేశంలోని 23 నగరాలకు చెందినవారికి ఈ జాబితాలో స్థానం దక్కగా, బెంగళూరు నుంచి అత్యధికంగా 129 మంది ఉన్నారు. ముంబై నుంచి 78 మంది, గురుగ్రామ్, ఢిల్లీ నుంచి 49 మందికి చోటు లభించింది. అయితే జాబితాలోని సంస్థల్లో 25 శాతం మాత్రమే స్టార్ట్ మార్కెట్లలో ఉన్నాయి. ఇక మిల్లేనియంలో టాప్-10 అత్యంత విలువైన కంపెనీల్లో 8.. స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టినవే కావడం విశేషం. ఇక ఈ జాబితాలో పేరున్న 405 మంది వ్యవస్థాపకులు.. 2000వ సంవత్సరం నుంచి దేశంలో విలువైన సంస్థలను నెలకొల్పినవారే. వీరిలో 56 శాతం మంది ఇంజినీరింగ్, 10 శాతం మంది చార్టెడ్ అకౌంటెంట్లు, ఏడుగురు వైద్యులున్నారు. ఐఐటీ ఢిల్లీ నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా పొందినవారు 38 మంది. ఐఐటీ ముంబైకి చెందినవారు 24, ఐఐటీ కాన్పూర్‌కు చెందినవారు 20 మంది ఉన్నారు.

లాభాల్లో మార్కెట్లు

ముంబై, నవంబర్ 30: తీవ్ర ఒడిదుడుకుల మధ్య ట్రేడైన దేశీయ స్టాక్ మార్కెట్లు చివరకు లాభాల్లో ముగిశాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు ఈ లాభాలను నిలుపుకోలేకపోయాయి. నెలవారీ డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగియడం, అమెరికా మార్కెట్లు యథాతథంగా ట్రేడవడంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 67 వేల పైకి చేరుకున్నది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 86.53 పాయింట్లు అందుకొని 66,988.44కి చేరుకోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 36.55 పాయింట్లు అందుకొని 20,133.15కి చేరుకున్నది. సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనైప్పటికీ బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ వరుసగా రెండో రోజు 4 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్నది. రంగాలవారీగా చూస్తే హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్, రియల్టీ, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లు రెండు శాతం వరకు లాభపడ్డాయి. కానీ, యుటిలిటీ, బ్యాంకింగ్ రంగ సూచీలు నష్టపోయాయి.

7 లక్షల కోట్లు పెరిగిన సంపద..

గత మూడు రోజులుగా స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడటంతో మదుపరుల సంపద కూడా అంతకంతకు పెరుగుతున్నది. గత మూడు సెషన్లలో మదుపరులు రూ.6.88 లక్షల కోట్ల సంపద పెరిగింది దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.3,35,60,155.58 కోట్లు లేదా 4 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. వరుసగా రెండోరోజు బుధవారం కూడా బీఎస్ఈ లిస్టైన సంస్థల విలువ 4 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలోనే ఉన్నది. మే 24, 2021లో 3 లక్షల కోట్ల డాలర్లు అధిగమించిన మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ గత రెండున్న రేండ్లలోనే మరో లక్ష కోట్ల డాలర్లు పెరిగి 4 లక్షల కోట్ల డాలర్లు అధిగమించింది. మే 28, 2007న ట్రిలియన్ డాలర్ల మార్కెట్ క్యాప్‌నకు చేరుకున్న విషయం తెలిసిందే.

హైదరాబాద్ హౌజింగ్ భేష్

జూలై-సెప్టెంబర్‌లో 34 శాతం వృద్ధి • 14,190 యూనిట్లు విక్రయం

తాజా నివేదికలో ప్రాప్‌టైగర్ వెల్లడి • లగ్జరీ ఇండ్లకూ భలే గిరాకీ

PROPTIGER.COM

హైదరాబాద్ ఇండ్లకు డిమాండ్ కొనసాగుతున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో హైదరాబాద్‌సహా దేశవ్యాప్తంగా 8 ప్రధాన నగరాల్లో నమోదైన నివాస విక్రయాల వివరాలను ఆర్ఈఏ ఇండియాకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్, హౌజింగ్ బ్రోకరేజీ ప్రాప్‌టైగర్.కామ్ వెల్లడించింది. 'రియల్ ఇన్‌సైట్ రెసిడెన్షియల్-జూలై-సెప్టెంబర్ 2023' పేరిట గురువారం ఓ నివేదికను విడుదల చేసింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై-ఎంఆర్, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ నగరాల్లో సేల్స్‌పై ఈ రిపోర్టు వచ్చింది. ఈ నగరాల్లో హౌజింగ్ సేల్స్ 22 శాతం, కొత్త నిర్మాణాలు 17 శాతం పెరిగాయన్నది.

3 నెలల్లో లక్ష యూనిట్లు

గత ఆర్థిక సంవత్సరం (2022-23) జూలై-సెప్టెంబర్‌లో ఈ 8 నగరాల్లో 83,220 యూనిట్లు అమ్ముడయ్యాయి. అయితే ఈసారి 1,01,220 యూనిట్ల విక్రయాలు జరిగాయి. చెన్నై మినహా అన్ని నగరాల్లో ఈసారి వృద్ధి కనిపించినట్టు ప్రాప్‌టైగర్.కామ్ తెలియజేసింది. అలాగే కొత్త ప్రాజెక్టులు 17 శాతం ఎగిసి 1,23,080 యూనిట్లుగా ఉన్నాయి. నిరుడు 1,04,820 యూనిట్లే. కాగా, అమ్మకాల్లో ముంబై-ఎంఆర్, పుణెల వాటానే దాదాపు సగం ఉన్నాయని ప్రాప్‌టైగర్.కామ్ వెల్లడించింది. అయితే దేశ వాణిజ్య రాజధాని ప్రాంతం కావడం కలిసొచ్చింది.

3,620 యూనిట్లు

హైదరాబాద్‌లో నిరుడు జూలై-సెప్టెంబర్‌తో పోల్చితే ఈ ఏడాది జూలై-సెప్టెంబర్‌లో ఇండ్ల విక్రయాలు 3,620 యూనిట్లు పెరిగాయి. పోయినసారి 10,570 ఇండ్లు అమ్ముడయ్యాయి. ఈసారి 14,190 ఇండ్లకు విక్రయాలు పెరిగాయని ప్రాప్‌టైగర్.కామ్ తమ తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఇదిలావుంటే చెన్నైలో 12 శాతం ఇండ్ల అమ్మకాలు ఈసారి క్షీణించినట్టు తేలింది. కాగా, ఈ జూలై-సెప్టెంబర్‌లో నివాసానికి సిద్ధంగా ఉన్న (రెడీ టు ఆక్యుపై) ఇండ్ల అమ్మకాలు 14 శాతం ఎక్కువగా అమ్ముడయ్యాయి. అలాగే కోటి రూపాయలకుపైగా విలువైన ఇండ్ల విక్రయాలూ 31 శాతం పెరిగాయని స్పష్టమైంది. 8 నగరాల్లోని అపార్టుమెంట్లు, విల్లాల విక్రయాలనూ ప్రాప్‌టైగర్.కామ్ తమ రిపోర్టులో పరిగణనలోకి తీసుకున్నది. కాగా, ప్రాప్‌టైగర్.కామ్ అనుబంధ సంస్థలే హౌజింగ్.కామ్, మకాన్.కామ్ అన్న విషయం తెలిసిందే.

-బిజినెస్ బ్యూరో

ఈ జూలై-సెప్టెంబర్‌లో

ఇండ్ల అమ్మకాలు

నగరం	2023	2022
ముంబై-ఎంఆర్	30,300	28,800
పుణె	18,560	15,700
హైదరాబాద్	**14,190**	**10,570**
బెంగళూరు	12,590	7,890
అహ్మదాబాద్	10,300	7,880
ఢిల్లీ-ఎన్‌సీఆర్	7,800	5,430
చెన్నై	3,870	4,420
కోల్‌కతా	3,610	2,530

అల్ట్రా-లగ్జరీ ఇండ్లలో..

హైదరాబాద్‌సహా దేశంలోని టాప్-7 నగరాల్లో రూ.40 కోట్లు, ఆపై విలువైన అల్ట్రా-లగ్జరీ ఇండ్ల విక్రయాలపై ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ గురువారం ఓ నివేదికను విడుదల చేసింది. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా మొత్తం ఈ ఏడు నగరాల్లో 58 ఇండ్లు అమ్ముడయ్యాయని చెప్పింది. అయితే ముంబైలోనే ఏకంగా 53 యూనిట్లు అమ్ముడవడం విశేషం. మిగతా ఐదు యూనిట్లలో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు చెందినవి నాలుగు ఉండగా.. వీటిలో గురుగ్రామ్‌లో రెండు అపార్ట్‌మెంట్లు, ఢిల్లీలో రెండు బంగ్లా లావాదేవీలున్నాయి. ఇక ఒకటి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అమ్ముడైనట్టు అనరాక్ తెలియజేసింది. చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, పుణెల్లో సేల్స్ లేవన్నది. ఇక నిరుడు మొత్తంగా ఈ నగరాల్లో 13 అల్ట్రా-లగ్జరీ ఇండ్లే అమ్ముడయ్యాయి. ఈసారి అవి 58కి పెరుగగా, వీటి విలువ రూ.4,063 కోట్లుగా ఉన్నది. గత ఏడాది అమ్మకాల విలువ రూ.1,170 కోట్లు. హై నెట్ వర్త్ ఇండివీడ్యువల్స్, అల్ట్రా-హై నెట్ వర్త్ ఇండివీడ్యువల్స్ నుంచి వీటికి డిమాండ్ కనిపిస్తున్నట్టు అనరాక్ చైర్మన్ అనుజ్ పురి వెల్లడించారు. కాగా, ముంబైలో జరిగిన 53 లావాదేవీల్లో రూ.200 కోట్లకుపైగా విలువైనవి మూడున్నాయి. రూ.100-200 కోట్ల మధ్య 7 ఇండ్ల ధరలున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో జరిగిన లావాదేవీల్లోనూ రెండు ఇండ్లు ఒక్కోటి రూ.100 కోట్లపైనే పలికాయి. ఇదిలావుంటే హైదరాబాద్‌తోపాటు దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్‌లో రూ.4 కోట్లకుపైగా విలువైన ఇండ్ల అమ్మకాలపై ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సీబీఆర్ఈ ఇటీవలే ఓ నివేదికను విడుదల చేయగా, ఇందులో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచిన సంగతి విదితమే. మొత్తం విక్రయాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్‌ల వాటానే 90 శాతం ఉండటం విశేషం. ఢిల్లీ-ఎన్‌సీఆర్ 37 శాతం, ముంబై 35 శాతం, హైదరాబాద్ 18 శాతంతో ఉన్నాయి.

దేశంలోని టాప్-8 నగరాల్లో హౌజింగ్ మార్కెట్లు వృద్ధిపథంలో సాగుతున్నాయి. పాజిటివ్ కస్యూమర్ సెంటిమెంట్ కలిసొస్తున్నది. గృహ రుణాలపై వడ్డీరేట్లు స్థిరంగా ఉండటం, ప్రజల ఆదాయం పెరుగడం.. సేల్స్‌ను పెంచుతున్నది.

-వికాస్ వాధవాన్, ప్రాప్‌టైగర్.కామ్ వ్యాపార అధిపతి

ఖర్చులు తగ్గించుకునే పనిలో ఐటీ

అప్రెంటిస్ ఉద్యోగాలకు సై అంటున్న సంస్థలు

న్యూఢిల్లీ, నవంబర్ 30: దేశీయ ఐటీ సంస్థలు ఖర్చులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి ఉద్యోగ నియామకాలకు చెక్ పెడుతునే అదే సమయంలో అప్రెంటిస్ ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ప్రతిభాపాటవాలు లేని సిబ్బందిని రిక్రూట్ చేసుకొని వారికి శిక్షణ ఇచ్చి వారి అప్రెంటిస్ సమయంలో స్టైఫండ్‌ను కూడా సంస్థలు ఇస్తున్నాయి. దేశీయ ఐటీ/ఐటీఈఎస్ విభాగాల్లో ప్రస్తుతం ఇదే ట్రెండ్ నడుస్తున్నది. గడిచిన ఏడాదికాలంలో ఈ నియామకాలు 250 శాతం చొప్పున పెరిగాయని ఓ సర్వే వెల్లడించింది.

హైదరాబాద్‌లో అత్యధికం..

బీఎఫ్ఎస్ఐ, ఐటీ/ఐటీఈఎస్ రంగ సంస్థలు అప్రెంటిస్ ఉద్యోగులకు పెద్దపీట వేస్తున్నాయి. పూర్తి స్థాయి ఉద్యోగుల్లో 75 శాతం వీరిని నియమించుకోవడానికి రెడీ అవుతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. నగరాల వారీగా చూస్తే కోయంబత్తూరు, హైదరాబాద్, పుణె వంటి నగరాల్లో అత్యధికంగా అప్రెంటిస్ సిబ్బందిని రిక్రూట్ చేసుకుంటున్నట్టు క్యూస్ కార్ప్ విడుదల చేసిన 'అప్రెంటిస్ స్కిల్ ట్రెండ్స్ రిపోర్ట్'లో వెల్లడించింది. గడిచిన ఐదేండ్లలో మహిళా ఉద్యోగుల రాజీనామాలు చేయడంతో అప్రెంటిస్ రిక్రూట్‌మెంట్లు ఏడు రెట్లు పెరిగాయని పేర్కొంది. భవిష్యత్తుతో ఐటీ/ఐటీఈఎస్ విభాగాల్లో 79 శాతం ఉద్యోగులు అప్రెంటిస్ ద్వారా నియమించుకునే అవకాశాలున్నాయని తెలిపింది. మరోవైపు, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, అహ్మదాబాద్ వంటి మెట్రో నగరాల్లోనూ అప్రెంటిస్ ఉద్యోగులు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రాల వారీగా చూస్తే తెలంగాణతోపాటు గుజరాత్, మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్, తమిళనాడులు ఉన్నాయి.

- **ప్రస్తుతం 23-26 ఏండ్లలోపు అప్రెంటిస్‌లు 9 లక్షల మంది ఉన్నారు.**
- **వీరికి రూ.11 వేల నుంచి 75 వేల లోపు వేతనం చెల్లిస్తున్నారు.**

అరబిందో జనరిక్ ఆస్తమా ఔషధానికి

యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం

న్యూఢిల్లీ, నవంబర్ 30: హైదరాబాద్ ఆధారిత అరబిందో ఫార్మా.. తమ అనుబంధ సంస్థ యుగియా ఫార్మా స్పెషాలిటీస్‌కు జనరిక్ ఆస్తమా మెడికేషన్ మార్కెటింగ్ కోసం అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి తుది ఆమోదం లభించినట్టు గురువారం తెలియజేసింది. పిల్లల్లో ఆయాసం చికిత్సకు ఈ ఔషధాన్ని వినియోగిస్తారన్నది. కాగా, ఆస్ట్రజెనెకా ఫార్మా స్యూటికల్స్ ఎల్‌పీకి చెందిన పల్మీకార్ట్ రెప్సుల్స్ ఇన్హలేషన్ సస్పెన్షన్‌కు మా ఈ ఔషధం చికిత్సాపరంగా సరిమానమని సంస్థ